క్లుప్తంగా

సీ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం



నరసరావుపేట: భోజన ప్రియుల కోసం ఫుడ్ ఫెస్టివల్స్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక రావిపాడు రోడ్డులోని పారడైజ్ ఫంక్షన్ హాలులో కళా సాగర్‌రెడ్డి ఏర్పాటు చేసిన మూడు రోజుల 'సీ-ఫుడ్ ఫెస్టివల్' సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. వంటకాలను పరిశీలించారు. నూతన రుచులను నరసరావుపేట ప్రజలకు పరిచయం చేయటం సంతోషకరమన్నారు. ఎంపీపీ ఎం.శ్రీనివాసరావు, న్యాయవాది దేశిరెడ్డి మల్లారెడ్డి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

నేడు గుండె వైద్య శిబిరం

ఈపూరు : ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ (విజయవాడ) వైద్యులు ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పల్లా సైదారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్కానింగ్, ఈసీజీ, 2డీ ఎకో స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నవోదయ ఎంట్రన్స్ మోడల్ టెస్ట్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సిద్ధార్థ నగర్ గీతమ్స్ హైస్కూల్‌లో నవోదయ ఎంట్రన్స్ మోడల్ గ్రాండ్ టెస్ట్ శనివారం నిర్వహించారు. గీతమ్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి ప్రశ్న పత్రాలను విద్యార్థులకు అందజేశారు. 170మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అధిక మార్కులు సాధించిన నిషిత్, అభిలాష్, సన్నీశ్రీ, జయశ్రీ, భరత్‌కు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రొంపిచర్ల ఏఓగా శివలలిత

రొంపిచర్ల: మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా పి.శివలలిత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తూ డిప్యూటేషన్‌పై వచ్చారు. ప్రస్తుత ఏఓ పి. విజయభాస్కర్ నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. పాతూరు ప్రాంతానికి చెందిన మాదారపు శేషగిరిరావు(40) పల్నాడు రోడ్డు మున్సిపల్ హైస్కూల్ పక్క వీధిలో ఇస్త్రీ బండి నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. సమీపంలోని లక్ష్మీ టీస్టాల్ వద్ద తెల్లవారుజామున అపస్మారక స్థితిలో అతను పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శేషగిరిరావును వైద్యశాలకు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ రహంతుల్లా ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతుడి భార్య వెంకాయమ్మను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడినట్లు భార్య పోలీసులకు వివరించింది. గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ

యడ్లపాడు: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ ఒక సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వ పాఠశాలలకు ప్రథమ చికిత్స మెడికల్ కిట్లు దాతలు అందించటం అభినందనీయమని నరసరావుపేట డీవైఈఓ కె.వేణుగోపాలరావు అన్నారు. యడ్లపాడు లూథరన్ హైస్కూల్ ఆవరణలో హెచ్ఎం బీఎస్ పద్మలత, విజయభారతి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీవైఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిమ్మాపురానికి చెందిన ఎన్నారై ఆర్.రంజని తన తండ్రి రావి సాంబశివరావు జ్ఞాపకార్థంగా రూ.10వేల విలువ చేసే మెడికల్ కిట్లకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. మెడికల్ కిట్లను మండలంలోని పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు అందజేస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ కె.హేమ, ఎంపీ నాగరత్నం, రంజని కుటుంబ సభ్యులు పంపిణీచేశారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గరికపాడులో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగుతోందని, ప్రజా సంక్షేమం వర్ధిల్లుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మూగచింతలపాలెం, గరికపాడు, మేళ్లవాగు గ్రామాల్లో సుమారు రూ.1.24కోట్లతో నిర్మించిన నూతన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల భవనాల ప్రారంభోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెల్త్ క్లినిక్, ఆర్బీకేలు, సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందజేయడంలో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, నీరు-చెట్టు తదితర కమిటీల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. దుర్మార్గపు ఆలోచనలతో, మోసపూరిత వాగ్దానాలతో టీడీపీ అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతోందని, ప్రజలు వీటిని గుర్తుంచి తిప్పికొడతారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ ఎస్.కోటేశ్వరరావు, ఎంపీపీ బత్తి రాములు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందు నాయక్, జెడ్పీటీసీ ఆర్.బీమీబాయి కృష్ణానాయక్, వైద్యులు టి.శంకరనారాయణ, ఎం.సాయి వినూత్న, పీఆర్ ఏఈ షేక్ అల్లాభక్షు, ఈపూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బి.శ్రీరామరెడ్డి, సర్పంచ్‌లు ఎం.సీతమ్మ, ఎం.కొండలు, కె.బాలిరెడ్డి, పి.సాయిబాబు, ఎంపీటీసీ బి.రాధ, బి.గురవయ్య, ఎం.రాజయ్య, కె.బంగారయ్య, పి.అవినాష్‌రెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి, పి. జార్జి తదితరులు పాల్గొన్నారు.

పింఛను పంపిణీ

మేళ్లవాగు గ్రామంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వృద్ధులకు శనివారం పెంచిన పింఛన్ నగదు అందజేశారు. మండలంలో వైఎస్సార్ పింఛను కానుక 8,905 మందికి రూ.2.66 కోట్లు ప్రతి నెలా 1వ తేదీనే అందిస్తున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మనబడి నాడు-నేడు ద్వారా అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు స్థాయిలో తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలో పలు అబివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మేళ్లవాగు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు, జగన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



గణపవరంలో స్థానికులతో మాట్లాడుతున్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

నాదెండ్ల: గణపవరం జెడ్పీ క్వారీలోని ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చిలకలూరిపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు హామీ ఇచ్చారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి క్వారీలో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన కన్నా నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. త్వరలో స్థానికులు, నాయకులతో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు తులం సుధాకర్, పిల్లి సాగర్‌బాబు, ఆదంవలి, మాజీ ఉప సర్పంచ్ గాలి బుచ్చయ్య, నాయకులు అయన వెంట ఉన్నారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

చిలకలూరిపేట: పట్టణంలోని మద్ది నగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి(37) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య నాజియా, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సొంత ఇల్లు లేకపోవడం, రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం పరిస్థితిని ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉమర్‌వలి, ఆర్కే బాజీ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన శనివారం మద్దినగర్‌లోని మస్తాన్‌వలి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు రూ. 50 వేలు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. పిల్లల చదువు బాధ్యత పూర్తిగా తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబ సభ్యులు, స్థానిక పెద్దలు రాజేష్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షిత మంచినీటి ప్లాంట్ ప్రారంభం

పట్టణంలోని 38వ వార్డులో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఉచిత సురక్షిత మంచినీటి ప్లాంట్‌ను శనివారం మల్లెల రాజేష్‌నాయుడు ప్రారంభించారు. సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, యడ్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్తా వాసు, పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, వార్డు ఇన్‌చార్జి యాదాల సుజాత, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు పాల్గొన్నారు. పట్టణంలోని సుభానినగర్ ఖబరస్థాన్(ముస్లిం శ్మశాన వాటిక)కు వెళ్లే మార్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ. 6.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు మల్లెల రాజేష్‌నాయుడు శంకుస్థాపన చేశారు.

స్నేహితుడిపై దాడి



యడ్లపాడు: డబ్బులివ్వకుంటే ప్రేయసితో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించిన స్నేహితుడిపై కత్తితో దాడి చేయడంతో అతను ఆస్పత్రి పాలయ్యాడు. పోలీసులు వివరాల మేరకు.. మండలంలోని దింతెనపాడు గ్రామానికి చెందిన తోటకూర జగదీష్, మేడూరి అశోక్ మిత్రులు. ఇద్దరు శనివారం మధ్యాహ్నం గ్రామ ప్రారంభంలోని చెరువు కట్టపై మద్యం సేవిస్తుండగా జగదీష్ మరో అమ్మాయితో దిగిన ఫొటోలు తన సెల్ నుంచి డిలిట్ చేయాలంటే నగదు ఇవ్వాలంటూ అశోక్ డిమాండ్ చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలై ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో జగదీష్ అక్కడే ఉన్న కత్తితో అశోక్ తలపై మోది, కడుపులో పొడిచాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి ఇద్దరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జగదీష్ తల్లి, అశోక్ సోదరుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలైన అశోక్‌ను గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. హాస్పిటల్‌లో అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో ట్యాబుల పంపిణీ

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఎంపీటీసీ రాజేశ్వరి శనివారం పంపిణీ చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు అందించారు. హెచ్ఎం వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు

నాదెండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను శనివారం ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు పంపిణీ చేశారు. ఎంఈవో ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జిల్లా పరిషత్ నిధుల నుంచి విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంపీటీసీలు యల్లారావు, అంకమ్మ, పీఎంసీ చైర్మన్ బిరుదు దేవదానం, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ

చిలకలూరిపేటటౌన్: బొప్పూడి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ దేవినేని శంకరరావు పంపిణీ చేశారు. మెటీరియల్ పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ రమేష్ బాబు, పీసీ చైర్మన్ పున్నస బుడే, హెచ్ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు సిద్ధం

శావల్యాపురం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలకు రంగం సిద్ధం చేశామని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు సచివాలయాల వారీగా క్రీడా దస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 110 జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంతో అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో పాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సహకారంతో ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు పేరుసోముల నాసరయ్య, వ్యాయమా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

రొంపిచర్ల: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ మాధ్యుబాబు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన డ్రా నిర్వహించారు. గ్రామ స్థాయిలో 90 జట్లు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈవోపీఆర్డీ రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు సిద్దయ్య, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇవ్వలేదని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట రూరల్: కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తోందని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడు వివరాల మేరకు.. ఇస్సప్పాలెం రోడ్డులోని కళాశాలలో ఎం.జాన్ మార్క్ డిగ్రీలో చేరాడు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన అతను అనంతరం కళాశాలకు రాలేదు. ప్రవేశం సమయంలో యాజమాన్యానికి ఇచ్చిన పది తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్లు తనకు ఇవ్వాలని యాజమాన్యాన్ని జాన్ మార్క్ పలు సార్లు కోరాడు. అయితే డిగ్రీ మూడేళ్ల ఫీజు చెల్లిస్తేనే.. సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం చెప్పడంతో.. అతను శనివారం కళాశాల సమీపంలో సెల్ఫీ వీడియోతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన స్థానికులు జాన్ మార్క్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి తమకు సమాచారం అందిందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ దినేష్ స్పందించారు.

కంది పంట సాగుపై అవగాహన

రొంపిచర్ల: మాచవరం ఆర్బీకేలో కంది పంటలో యాజమాన్య పద్ధతులు, పంట కొనుగోలుపై శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడీఏ శివకుమారి, ఏడీఏ పి. మస్తానమ్మ పాల్గొన్నారు. యాజమాన్య పద్ధతులను వివరించారు. గ్రామంలో సాగుచేస్తున్న మినుము, జొన్న పంటను సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి పి.శివలలిత, వీఏఏలు పాల్గొన్నారు.

నూతన పింఛనోత్సాహం..



సీబీ కాలనీలో పింఛను నగదు అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి, వలంటీరు

నరసరావుపేట: పట్టణంలో నూతన పెంచిన నూతన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. 1వ వార్డు సాయినగర్ సచివాలయంలో వార్డు ఇన్‌చార్జిలు రామిశెట్టి కొండ, షేక్ మాబు వృద్ధులకు రూ.3 వేల పింఛను అందజేశారు. సత్తెనపల్లిరోడ్డులోని సీబీ కాలనీలో వార్డు ఇన్‌చార్జి దాసరి శ్రీనివాసరావు, వలంటీరు తిరుమలరావు పింఛన్లు పంపిణీ చేశారు. బరంపేట 33వ వార్డులో వార్డు ఇన్‌చార్జిలు మద్రిపూడి రాంబాబు, కంచర్ల రామకోటేశ్వరరావు వృద్ధులకు పింఛన్ పంపిణీ చేయగా, ప్రకాష్‌నగర్ పదో వార్డులో మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి నూతన పింఛన్ల పంపిణీ మహోత్సవం నిర్వహించారు.

నేడు పెంచిన పింఛన్లు పంపిణీ

యడ్లపాడు: పెంచిన పింఛన్లను ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై విమర్శలా..

నరసరావుపేట: ఎన్నో సంవత్సరాలుగా బీసీల కోసం పనిచేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను విమర్శించడం సరైందికాదని వెనుకబడిన సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, ఏపీ బీసీ సమైఖ్య సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొందిలి శ్రీనివాస సింగ్, ప్రధాన కార్యదర్శి పానుగోటి ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం తమ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణయ్యపై బీసీ సంక్షేమ సంఘ నాయకులు కొంతమంది చేసిన ఆరోపణలను ఖండించారు. అసలు బీసీ సంఘం అంటేనే ఆర్.కృష్ణయ్య గుర్తొస్తారని చెప్పారు. అలాంటి వ్యక్తి దగ్గర కొంతకాలం పనిచేసి, తర్వాత తనకు తానే రాష్ట్ర అధ్యక్షులుగా చెప్పుకొనే కొంతమంది ఇప్పుడు ఏ పార్టీ తరఫున ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కృష్ణయ్య న్యాయ పోరాటం చేస్తున్నారని, ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు.

అయోధ్యరాముని అక్షింతలు అందజేత

శావల్యాపురం: వెలమవారిపాలెంలో అయోధ్య రాముని అక్షింతలు శనివారం ఇంటింటికి అందజేసినట్లు గట్టుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. రెడ్డి వెంకటేశ్వరరావు, కాంతారావు, పెద్దన్న, ఉజ్జినేని సుబ్బారావు, శ్రావణి, పార్వతీ, నాగలక్ష్మి ఉన్నారు.

వినుకొండ(నూజెండ్ల) : అయోధ్య రామమందిరం నుంచి అక్షింతలను కమ్మవారిపాలెం గ్రామంలో శనివారం ఇంటింటికీ పూజారి కోసూరి రామ్మోహనాచార్యులు అందజేశారు.

రొంపిచర్ల: మండల కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను శనివారం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు బలరామరాజు, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



మిరప పంటలో సస్యరక్షణపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల) : మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై శనివారం జాలలపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ధనుంజయరావు పాల్గొని, మిరప పంటలో అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. ఉద్యాన అధికారి నబీరసూల్, ఏడీఏ రవిబాబు, ఏఓ అంజిరెడ్డి, వీఏఏ భార్గవి పాల్గొన్నారు.

రెడ్డి పేరంటాలమ్మ ఆలయానికి భూమిపూజ

నాదెండ్ల: సాతులూరులో కొలువైన రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు కమిటీ సభ్యులు శనివారం భూమి పూజ నిర్వహించారు. సుమారు రూ.కోటి వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గత నెల 28న ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించారు. సనాతన శంకర మఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ నిమ్మకంటి నరసయ్య చార్య స్వామిజీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామీజీని డాక్టర్ నల్లబోతు శరత్‌చంద్ర, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

